

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

### 1991-జనవరి

"పరీక్షలు దగ్గరకొస్తూ వుంటే ఇప్పుడీ సినిమా అవసరమా ఆశా?" ఆటోకి డబ్బులిస్తూ చిరాగ్గా అంది భాను.

"పరీక్షలకి చదవాలంటే ముందు మోటివేషన్ కావాలి కదా? చిరంజీవి సినిమాకంటే మోటివేషన్ ఏదుంటుంది చెప్పు? అందులోనూ శ్రీదేవి! అసలు మేలో రిలీజయినప్పుడే చూడాల్సింది! మిస్సయిపోయా. మనదృష్టం కొద్దీ మళ్ళీ మార్నింగ్ షోలో వేసారు. ఈ సారి మిస్సయే ప్రశ్నే లేదు. పద పదా! సూసీనీ, కోమలినీ ముందే వొచ్చి టిక్కెట్లు కొనమన్నా. కొన్నారో లేదో!" తొందరపెట్టింది ఆశ.

టిక్కెట్లు పట్టుకోని ఎదురొచ్చారు సూసీ, కోమలీ.

"నీ సినిమా పిచ్చి కాదు కానీ, మా చావుకొచ్చిందే ఆశా! ఇదిగో టికెట్లు. సినిమాకని చెప్తే మా అమ్మ చచ్చేట్టు తిట్టింది!" కోమలి సణుగుతూనే టికెట్లందించింది. అందరూ హాలు వైపు నడచారు.

వున్నట్టుండి "హేయ్! అశోక్!" అక్కడే వున్న మగపిల్లల గుంపు వైపు చూసి అరచింది భాను.

" ఏమయిందే? అశోక్ ఎవరూ?" వాళ్ళూ ఆగిపోయి అయోమయంగా అడిగారు అమ్మాయిలు.

" ఆ అబ్బాయితో మాట్లాడాలి", వాళ్ళకోసం ఆగకుండా అబ్బాయిల గ్రూపు దగ్గరికెళ్ళింది భాను.

"హాయ్ అశోక్! బాగున్నారా?" అశోక్ పక్కగా నిలబడి పలకరించింది.

మిగతా అబ్బాయిలు మాటలాపి అశోక్ వంక వింతగా చూసారు.

"హాయ్ భానూ! అయాం ఫైన్. మీరెలా వున్నారు?"

"బాగున్నాను. మీ స్నేహితులని పరిచయం చేయరా?" మిగతా అందరి వంకా చూస్తూ నవ్వుతూ అన్నది భాను.

అశోక్ ఇబ్బందిగా నవ్వి,

"ష్యూర్! వీడు వెంకట్, అది శివ, ఇదిగో వీడు విజయ్! గయ్స్, తను భాను. బీ.టెక్ చదువుతున్నారు." పరిచయం చేసాడు.

అందరూ భాను వంక చూసి పలకరింపుగా నవ్వారు.

"నేనూ ఫ్రెండ్స్‌తో వచ్చాను." అమ్మాయిలవైపు తిరిగి రమ్మన్నట్టు చేయి వూపింది భాను.

అందరి పరిచయాలయ్యాక, వున్నట్టుండి అశోక్ వైపు చూసి అంది సూసీ.

"నాకు మీరు తెలుసు!"

"అవును. డాన్స్ అకాడెమీలో నేనూ మిమ్మల్ని చూసాను," తనూ అన్నాడు అశోక్.

డాన్స్ అకాడేమీ యేంటి, అని భాను అడగబోయేంతలో, "పదండి, పదండి, మళ్ళీ సినిమా మొదలై పోతుంది", ఆశా అందరినీ హడావిడి పెట్టింది.

"తర్వాత కలుద్దాం" అంటూ హాలులోకెళ్ళిపోయింది భాను. సూసీ పక్కనే కూర్చోగానే అడిగింది.

"డాన్స్ అకాడెమీ యేంటే? నువ్వు డాన్స్ నేర్చుకుంటున్నావా?"

"అవునే! ఇంటర్ నించే మొదలు పెట్టాను. కూచిపూడి. ఆ అబ్బాయి, అశోక్ , కూడా అక్కడే నేర్చుకుంటున్నాడు. అతనూ అప్పుడే మొదలుపెట్టాడట. బాగా చేస్తాడు డాన్స్."

అశోక్ డాన్సు చేస్తాడా?

డాన్సు నేర్చుకునే మగవాళ్ళంటే తిప్పుతూ నడుస్తూ, వింతగా చేతులూపుతూ, వెకిలిగా కళ్ళు తిప్పుతూ వుంటారని సినిమాల్లో చూసి నవ్వుకునే వాళ్ళు తనూ, అమ్మా, నాన్నా! అశోక్ చాలా మామూలుగా వున్నాడు. అతని బాడీ లాంగ్వేజీ తమందరిది లాగానే వుంది. ఆలోచనలతో సినిమా మీద పెద్దగా దృష్టి పెట్టలేకపోయింది భాను.

సినిమా అయింతరవాత కాసేపుండి మాట్లాడతాడో, లేక మిగతా అబ్బాయిలతో కలిసి వెళ్ళిపోతాడో!

సినిమా ముగిసి బయటికొచ్చి అమ్మాయిలతో, "అశోక్ కి ఒక్కసారి బై చెప్పి వొస్తా," అని వాళ్ళ వైపెళ్ళింది భాను.

దగ్గరగా వొచ్చి నిలబడ్డ భానుని చూసి, అబ్బాయిలనొదిలి వొచ్చాడు అశోక్.

"సీ యూ అశోక్! మళ్ళీ లైబ్రరీకెప్పుడొస్తారు?"

"పరీక్షలకి చదువుకోవాలికదా? బహుశా వచ్చే వారం నించి రోజూ వొస్తాను," ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు అతను.

"ఓకే! అయితే వొచ్చే వారం నేనూ లైబ్రరీలో చదువుకుంటాను. లైబ్రరీలో కలుద్దాం. " స్నేహితులతో కలిసి వెళ్ళిపోయిందామె.

★★★★★★★★★★★★★★★★

## 1991-మే

యూనివర్సిటీ కేంటీన్ లో కాఫీ తాగుతున్నారు అశోక్, భానూ. గత నాలుగు నెలలుగా వాళ్ళిద్దరూ కూడబలుక్కోని లైబ్రరీలో చదువుకొని, కాంటీన్‌లో కాఫీలూ తాగుతున్నారు. ఎందుకలా కలుసుకుంటున్నారో వాళ్ళకే తెలియడంలేదు కానీ, బాగుందనిపిస్తుంది ఇద్దరికీ.

"నిన్నటితో పరీక్షలైపోయాయి కదా? సమ్మర్ హాలిడేస్ ఏంటి ప్రోగ్రాం?" బేగ్ లోనించి చాక్లెట్ ఒకటి తీసి అశోక్ కిచ్చి, తానొకటి నోట్లో వేసుకొని అడిగింది భాను.

"ఏముంటాయి? ఏమ్మే ఇంగ్లీషు లిటరేచర్ కొరకు సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ పరీక్ష ప్రిపేరవుతున్నాను. పరీక్ష తరవాత ఇంటర్వ్యూ కూడా వుంటుంది, చాలా కష్టమంటున్నారందరూ! బాగా ప్రిపేరవాలి. అసలు కిందటి వారమే జరగాల్సి వుంది, రాజీవ్ గాంధీ హత్యతో పోస్ట్‌పోన్ అయింది. అది సరే, నువ్వేం చేస్తున్నావ్ సమ్మర్లో?"

"ఏమీ లేదు. మా అమ్మమ్మ వాళ్ళ వూరు వెళ్ళొస్తా, ఖమ్మం. మా మావయ్య కూతురి పెళ్ళి. ఆ పెళ్ళికి కూడా వుండేలా వెళ్తున్నామందరమూ."

"ఎప్పుడు వెళ్ళేది?"

"జూన్ పదో తారీకు!"

"మళ్ళీ వచ్చేది?"

"జులై మధ్యలో వస్తా. థర్డ్ ఇయర్ క్లాసులు మొదలయ్యేసరికల్లా హైదరాబాదులో వుంటా."

"అది సరే, వొచ్చే వారం మా అకాడెమీలో డాన్సు ప్రోగ్రాం వుంది. నువ్వొస్తావా?" కొంచెం మొహమాటంగా అన్నాడు అశోక్.

"డాన్సా? ఎవరు చేస్తున్నారు?"

"మా క్లాసు వాళ్ళందరమూ కలిసి ఒక ఐటెం చేస్తున్నాము. నాకు కూడా ఒక సోలో చేసే అవకాశం వచ్చింది. సాధారణంగా సోలో ఐటెం అంత త్వరగా ఇవ్వరు," ఎంత మామూలుగా అందామనుకున్నా కొంచెం గర్వం తొంగిచూసింది అతని గొంతులో.

"తప్పకుండా వస్తాను. ఎన్నింటికి రావాలి?"

ప్రోగ్రాం పాంప్‌ఫ్లెట్ ఒకటి తీసి ఆమెకిస్తూ, "వీలైతే అమ్మా నాన్నలని కూడా తీసుకురా!" అన్నాడు.

"ట్రై చేస్తా. వాళ్ళొచ్చినా రాకపోయినా నేను తప్పక వొస్తా!"

★★★★★★★★★★★★

సాయంత్రం ఆరింటికి ఆ ఆడిటోరియం కళకళలాడుతోంది. ఆటోలోంచి దిగారు భానూ, ప్రభావతీ, పద్మనాభం. ఎంట్రన్సు దగ్గర వాళ్ళని చూసి ఎదురొచ్చాడు విజయ్.

"హాయ్ భానూ! గుర్తున్నానా? ఆ రోజు సినిమా దగ్గర కలిసాం! అశోక్ మనందరి టికెట్లూ నాకిచ్చాడు. రండి లోపలికెళ్దాము."

లోపలికి నడిచారందరూ.

"సినిమా ఏమిటే? నువ్వు వీళ్ళతో సినిమాలు చూస్తున్నావా?" ప్రభావతి గుసగుసగా అంది.

"అమ్మా! ఏంటీ నస? ప్రోగ్రాం చూడు ముందు!" భాను విసుక్కుంది.

"సరేలే! అసలు మగ పిల్లలు డాన్సులు చేయడం ఏమిటో, అది చూడడానికి మనం రావడం ఏమిటో ఏమిటో?"

"అదేంటి? నీకు చిరంజీవి డాన్సు చాలా ఇష్టం కదా? అతను మగవాడే కదా?"

"చిరంజీవి డాన్సంటే అది వేరు."

వేదిక మీద ప్రోగ్రాం మొదలవడంతో నిశ్శబ్దంగా కార్యక్రమం చూడసాగారందరూ!

★★★★★★★★★★★★★★★★★★★

ఆ రాత్రంతా తంబూరా నాదమూ, మువ్వల శబ్దమూ వినిపిస్తూనే వున్నాయి భానుకి. ఆమెకి ఆ డాన్సు పెద్దగా అర్థం కాలేదు కానీ, "స్వాగతం కృష్ణా" అన్న ఆ పాటా, దానికి అశోక్ చేసిన అభినయమూ మనసుకి హత్తుకున్నాయి.

ఆకుపచ్చని పట్టు పంచె కట్టి, నడుముకి అందమైన వడ్డాణమూ, మొహాన నిలువుగా నామమూ, అందమైన మేకప్పూ, నవ్వు మొహమూ, ఆ నర్తన వేగమూ, అదో లాటి అందం అతనిలో. దాన్ని మించిన ఏదో గ్రేస్, లయబద్ధంగా స్టేజీ అంతా తానే అయి కదుల్తూ..

బయట కనపడే అశోక్‌కీ, వేదిక మీద అంతా తానే అయి గుండ్రంగా తిరిగిన నాట్యమూర్తి అశోక్‌కీ ఎంత తేడా! అన్నట్టు, ఆ కళ్ళజోడేమయిందో? నవ్వుకుంటూ నిద్రలోకి జారిపోయింది భాను.

★★★★★★★★★★★★★★

"అన్నయ్యా! నీకేదో ఉత్తరం వొచ్చింది," కవర్ అతని మీదికి విసిరేసి వెళ్ళిపోయింది అమూల్య.

ఖమ్మం పోస్ట్ మార్కుతో వచ్చిన ఆ ఉత్తరాన్ని చూడగానే అశోక్ మొహం విచ్చుకుంది. ఆ రోజు ప్రోగ్రాం పూర్తయి వెళ్ళబోతూ వుంటే పరుగున వెనక్కొచ్చి "మీ ఇంటి అడ్రసివ్వు" అని అడిగి తీసుకుంటే ఎందుకో అనుకున్నాడు. ఇందుకన్న మాట.

డియర్ అశోక్,

బాగున్నావా?

నీ డాన్సు ప్రోగ్రాం తరవాత నిన్ను కలుసుకోవడం అసలు వీలు పడలేదు. ఆ మర్నాడే మా ఇంటికి మావయ్యా వాళ్ళొచ్చారు, పెళ్ళి షాపింగుకని. ఆ వారమంతా హడావిడి. ఆ తరవాత వాళ్ళతో కలిసి నేనూ ఖమ్మం వచ్చేసాను. పెళ్ళి హడావిడి భలే బాగుంది అమ్మమ్మా వాళ్ళింట్లో.

ఆ రోజు నీ డాన్సు అద్భుతం. బాబోయ్! ఎంత ఎనర్జీ! అసలు అలా స్టేజీ అంతా పరుగులు ఎలా పెట్టావలా? ఆ పాట పాడినావిడెవరూ? నాకు చాలా నచ్చింది. మా అమ్మకి చిరంజీవి డాన్సంత నచ్చలేదనుకో! నాకూ, మా నాన్నగారికీ బాగా నచ్చింది. మీ ఫ్రెండ్స్ అంతా ఎలా వున్నారు? అవునూ, నీ ప్రోగ్రాం చూడడానికి మీ అమ్మా, చెల్లీ రాలేదే? వాళ్ళని అడిగానని చెప్పు.

నీ ఎంట్రన్స్ ప్రిపరేషన్ ఎలా వుంది? నేను హైదరాబాదు రావడానికి ఇంకో నాలుగైదు వారాలన్నా పట్టొచ్చు. నేనొచ్చాక నీకు ఫోన్ చేస్తాను. లైబ్రరీలో కలుద్దాం. కింద నా అడ్రసు ఇస్తున్నా, వీలైతే ఉత్తరం వ్రాయి.

వుంటాను

యువర్స్ ఫ్రెండ్లీ

భాను

★★★★★★★★★★★★★★

డియర్ భానూ,

నీ ఉత్తరం చూసి చాలా సంతోషపడ్డాను. పెళ్ళి హడావిడి ఎంజాయ్ చేస్తున్నావన్నమాట. నేను మా బంధువుల్లో పెళ్ళికెళ్ళి ఎన్నేళ్ళయిందో! ఇప్పుడు నీ ఉత్తరం చూసాక మా బంధువుల్లో కూడా ఎవరికైనా అర్జంటుగా పెళ్ళైతే బాగుండని వుంది.

నా డాన్సు బాగుందన్నందుకు థాంక్స్. యూ ఆర్ బీయింగ్ టూ కైండ్.

ఇంకా చాలా నేర్చుకోవాలి, చాలా ప్రాక్టీసు చేయాలి. నాకు డాన్స్ అంటే ప్రాణం తెలుసా? మా స్నేహితులందరూ నవ్వుతారు. కొన్నిసార్లు వెక్కిరిస్తారు కూడా. అయినా పట్టించుకోకుండా ఉండడం నేర్చుకుంటున్నాను.

నువ్వు కూడా అందర్లా నేను డాన్సు చేస్తాను అని అనగానే నవ్వుతావనుకున్నాను. కానీ, నవ్వకుండా నన్ను అప్రీషియేట్ చేసినందుకు చాలా థాంక్స్.

ఎంట్రన్స్ ప్రిపరేషన్ ఏదో అలా నడుస్తుంది. ఇంకో రెండు వారాల్లో బీయ్యే రిజల్ట్స్ వస్తాయి. ఆ మార్కుల గురించి నాకు పెద్దగా బెంగలేదు. బానే వొస్తాయి. ఎమ్మే, ఆ తరవాత పీహెచ్‌డీ

చేసి, ఒక లెక్చరర్ వుద్యోగం సంపాదించుకోవాలని వుంది. అప్పుడు నేను డాన్సూ, ప్రొఫెషనూ బాలెన్సు చేయగలను. చూద్దాం ఏమవుతుందో. నా ప్రోగ్రాం అయిన మర్నాడే అమ్మూకి లెక్కల పరీక్ష. అందుకే అమ్మా, అమ్మూ రాలేకపోయారు. వొచ్చి వుంటే మిమ్మల్నందరినీ పరిచయం చేసి వుండేవాణ్ణి.

నువ్వు పెళ్ళి బాగా ఎంజాయ్ చేయి. నాకు ఫోటోలు తప్పక చూపించాలి, సరేనా? నువ్వు హైదరాబాదు వొచ్చాక కలుద్దాం.

వుండనా?

అశోక్.

★★★★★★★★★★★★★★★★★

## *1991-ఆగష్టు*

సస్టైనబుల్ ఎనర్జీ లెక్చరు వింటూ క్లాసులో కూర్చున్న భాను ఎందుకో తలతిప్పి కిటికీలోంచి బయటికి చూసి ఉలిక్కిపడింది.  బయట కారిడార్లో అశోక్ నిలబడి వున్నాడు పేపర్ చదువుతూ. తనకోసమే వచ్చాడా? ఎప్పుడూ ఇలా కాలేజీకి రాలేదు.

లేచి బయటికి వద్దామనుకుంటూండగానే బెల్లు మోగింది. హమ్మయ్య, అనుకుంటూ బయటికొచ్చింది. ఆమెని చూడగానే నవ్వు మొహంతో దగ్గరకొచ్చాడు అశోక్.

" అశోక్! నువ్వేంటి ఇక్కడ?" ఆశ్చర్యంగా అంది.

"నీ కోసమే వచ్చా! ఒక మంచి వార్త చెప్దామని."

ఏమిటన్నట్టు చూసింది భాను.

"నాకు సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మే సీటొచ్చింది. రిజల్టు చూడగానే నీకు చెప్దామని ఇటొచ్చాను."

" కంగ్రాట్స్! నీకు సీటొస్తుందని నాకెలాగూ తెలుసనుకో! పద పద, నాకు లంచ్ ఇప్పించు ఇవాళ. నేను మధ్యాహ్నం క్లాసులు దుమ్మా! పద, పద. మినర్వా కెళ్దాం పద!"

లోపలికెళ్ళి మిగతా అమ్మాయిలతో చెప్పి బయటికొచ్చింది భాను.

"అశోక్! నిన్నటికి మనం కలిసి సరిగ్గా ఒక సంవత్సరం అయింది. నీకు గుర్తుందా?" లంచ్ తిని బయటికొస్తూ ఉన్నట్టుండి అంది భాను.

"అవునా? ఒక సంవత్సరం అయిందా? భలే తొందరగా గడిచిపోయింది కదూ!"

ఇద్దరూ రోడ్డు పక్కగా నిలబడ్డారు.

"ఆగు, మన పరిచయం అయి యేడాదయింది కదా? నీ బర్త్‌డే ఎప్పుడు? మిస్ అయిపోయానే?" వున్నట్టుండి అంది భాను.

"ఆగస్టు ఒకటి." నవ్వుతూ అన్నాడు అశోక్.

"ఏం, వేళాకోళంగా వుందా? జోక్ చేస్తున్నావా?"

"ఇందులో జోక్ చేయడానికేముంది? పంతొమ్మిది వందల డెబ్భై, ఆగస్టు ఒకటి, నా డేటాఫ్ బర్త్! సరిగ్గా పది రోజుల కింద, ఇరవై ఒక్క యేళ్ళు నిండాయి. ఇందులో నిన్ను వేళాకోళం చేయడానికి ఏముంది," ఆశ్చర్యంగా అడిగాడు.

"ఓకే, జస్టే కో–యిన్సిడెన్స్! నా బర్త్‌డే కూడా ఆగస్టు ఒకటి! నైన్‌టీన్ సెవెన్‌టీ వన్!"

"అవునా? మనిద్దరి పుట్టినరోజులూ ఒక రోజేనన్నమాట. నేన్నీకంటే యేడాది పెద్ద. " నవ్వుకున్నారిద్దరూ.

"మరైతే ఎమ్మే క్లాసులెప్పుడు మొదలవుతాయి? ఇక నువ్వీ యూనివర్సిటీ లైబ్రరీకి రావేమో కదా?"

"క్లాసులు రెండు వారాల్లో మొదలవుతాయి. మలక్‌పేట నించి గచ్చిబౌలి దాకా రోజూ వెళ్ళడం కష్టం కాబట్టి అక్కడే హాస్టల్ లో వుందామనుకుంటున్నాను. మొన్నటి వరకూ ఎమ్మే క్లాసులు ఇక్కడే గోల్డెన్ త్రెషోల్డ్‌లో జరిగేవి. ఇప్పుడే గచ్చిబౌలి మెయిన్ కేంపస్‌కి మార్చారు."

"గోల్డెన్ త్రెషోల్డ్? అదేంటి? ఎక్కడుంటుంది?"

"భారత కోకిల, కవయిత్రి సరోజినీ నాయుడు గారి నివాసం. ఆవిడ దాన్ని భారత ప్రభుత్వానికిచ్చేసారు. ఆ భవంతి నాంపల్లి దగ్గర వుంది. దాన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫీసులా ఉపయోగిస్తారు."

"అవునా? నాకు తెలియనే తెలియదు. అయినా ఎమ్మే ఇంగ్లీషుకంత రోజూ క్లాసులేం వుంటాయి? ఇంజినీరింగ్‌లా లేబొరేటరీ కూడా వుండదు. హాస్టలెందుకు? అంత చదివేందుకు కూడా ఏమీ వుండదు కదా?"

నవ్వాడు అశోక్.

"నిజానికి లిటరేచర్ చదవడం చాలా కష్టం భానూ. లెక్కలూ, సైన్సూ, వీటికి నిర్దుష్టమైన డెఫినిట్ జవాబులు వుంటాయి కాబట్టి పరీక్షలు రాసి మార్కులు సంపాదించుకోవడం సులువు. అదే లిటరేచర్ అలా కాదు. చాలా సబ్జెక్టివ్‌గా వుంటుంది, కాబట్టి చదవడం తేలికే కానీ, పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించుకోవడం కష్టం. పైగా ఎంతో

అభిరుచీ, ఆలోచనా వుంటే కానీ సాహిత్యాన్ని అర్థం చేసుకోలేం. అందుకని లిటరేచర్ చదవడం అంత ఈజీకాదు ఇంజినీర్ భాను గారూ!"

సిగ్గుపడింది భాను.

"అఫ్ కోర్స్! సారీ, చాలా మొరటుగా మాట్లాడాను కదా?"

"నో, నో! నాటేటాల్. సరే, బస్సొస్తోంది, వెళ్తాను. అప్పుడప్పుడూ ఫోన్ చేస్తూ వుండు."

★★★★★★★★★★★★★★★★★★★

"భానూ, నీకే ఫోన్! అశోక్ అనుకుంటా," ప్రభావతి ఫోన్ భానుకి అందించింది.

"హలో!"

"హలో భానూ! డిస్టర్బ్ చేసానా? చిన్న పార్టీ ఇన్విటేషన్. బియ్యేలో గోల్డ్ మెడల్ వచ్చినందుకు కొందరు స్నేహితులకి లంచ్ పార్టీ ఇస్తున్నాను. నువ్వు రావడానికి వీలవుతుందా? వచ్చే శనివారం."

"వాట్! నువ్వు గోల్డ్ మెడల్ కొట్టిన సంగతి నాకు చెప్పనేలేదు. దిస్ ఈస్ నాట్ ఫెయిర్ అశోక్!"

"మన మధ్య ఆ ప్రసక్తి ఎప్పుడూ రాలేదు కదా? అందుకే చెప్పలేదు. అయినా సారీ! ఇప్పుడు చెప్తున్నా కదా? ఆ రోజు సినిమాలో కలిసిన మీ ఫ్రెండ్స్‌ని కూడా తీసుకురా. శనివారం పన్నెండింటికల్లా మా ఇంటికొచ్చేయండి. "

"అలాగే, సీ యూ!"

★★★★★★★★★★★★★★★★★★

"ఏమిటీ? ఆ అబ్బాయికి గోల్డ్ మెడలొస్తే మనందరికీ పార్టీనా? వాటీజ్ హేపెనింగ్?" కళ్ళెగరేసి అంది ఆశ.

"నిన్ను సరే, నువ్వంటే స్పెషల్. మరి మేమంతా ఎందుకు?" కోమలి రెట్టించింది.

"నీ బొంద! నేనేమీ స్పెషల్ కాదు. అందుకే మనందరినీ రమ్మన్నాడు. వెళ్తే అందరం కలిసి వెళ్దాం. లేకపోతే నోర్మూసుకోని వుందాం."

"అంత కోపం ఎందుకమ్మా? అందరమూ కలిసే వెళ్దాం." అనునయించింది సూసీ

★★★★★★★★★★★★★★★★★★★★★★★

మలక్‌పేటలో అశోక్ వాళ్ళ ఇంట్లో సందడిగా వుంది. ఎక్కువమంది లేరు. అశోక్ స్నేహితులొక పది మంది, అమూల్య, భానూ, ఆశా, కోమలి, సూసీ, అంతా కలిసి ఒక ఇరవై మంది దాకా కలిసారు.

అశోక్ తల్లి సుమిత్ర చాలా వరకు వంట తనే చేసి, కొన్ని పదార్థాలు బయటినుంచి తెప్పించింది.

అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుని భోజనం ముగించారు. అశోక్ స్నేహితులు చాలా వరకు ఇంజినీరింగ్, బీయెస్సీ కంప్యూటర్స్ చదువుతున్నారు. అశోక్ ఒక్కడే కొంచెం విభిన్నమైన ఆలోచనలున్న వ్యక్తిలా అనిపించాడు భానుకి.

తాను భాను సైకిల్ తగిలి కింద పడ్డ సన్నివేశాన్ని వివరించి అందరినీ నవ్వించాడు అశోక్.

భాను స్టేట్ లెవెల్ బాడ్మింటన్ క్రీడాకరిణి అని తెలిసి అందరూ అభినందించారు.

చదువులూ, హాబీలూ, పుస్తకాలూ అన్ని కబుర్లు ముగిసి మధ్యాహ్నం మూడింటికి మళ్ళీ టీ తాగి అందరూ బయల్దేరారు.

★★★★★★★★★★★★★

అందరూ వెళ్ళాక వెంకట్, శివా ఆగిపోయారు, ఇల్లంతా శుభ్రం చేసి పెడదామని.

"అది సరే కాని, అశోక్! భాను బలే క్యూట్ గర్ల్ కదా? తన ఫ్రెండ్స్ కూడా, భలే సరదాగా వున్నారు. ఆడపిల్లలని నువ్వు పార్టీకి పిలుస్తావని నేనెప్పుడూ అనుకోలేదు. ఈ డెవలప్‌మెంట్ ఎప్పణ్ణించి అశోక్?" నవ్వుతూ భుజం మీద చరుస్తూ అన్నాడు వెంకట్.

"చాల్చాల్లే! నోర్మూయ్యి. అమ్మ వింటే ఇంకేదో అనుకుంటుంది. తను చాలా మంచి అమ్మాయి. చాలా తెలివైనదీ, ఇంటరెస్టింగ్ అమ్మాయి. అందుకే కొంచెం స్నేహం."

"అబ్బోబ్బో! లైబ్రరీలో కలవడాలూ, మినర్వాలో కాఫీలూ, మాకేవీ తెలియదు పాపం! దాచుకో, రహస్యం దాచుకో!" శివ అన్నాడు.

"అసలు నీకు ఆడపిల్లలంటే ఇంట్రస్టు వుంటుందనుకోలేదు మేమెప్పుడూ!" అనేసింతరవాత కానీ తన మాటల అర్థమేంటో తట్టలేదు వెంకట్‌కి.  గదంతా ఒకలాటి నిశ్శబ్దం అలముకుంది. మడిచి పెడుతున్న కుర్చీని పక్కగా పెట్టి నిలబడ్డాడు అశోక్.

"అంటే? వాడ్డుయూ మీన్ వెంకట్? నాకుఆడపిల్లల మీద ఆసక్తి వుండదని ఎందుకనుకున్నావు నువ్వు?"

ఇబ్బందిగా నవ్వాడు వెంకట్.

"అది కాదురా! ఏదో పొరపాట్న నోరు జారాను. ఐ డిడ్ నాట్ మీన్ ఇట్?"

"వాట్ డిడ్ యు నాట్ మీన్? చెప్పు, మొహమాటమెందుకు? యూ థాట్ అయాం గే. ఎందుకంటే, నేను డాన్స్ చేస్తా కాబట్టి, అవునా?"

సీరియస్‌గా అన్నాడు అశోక్.

" వొదిలేయ్ అశోక్! సారీ అన్నాడుగా? మంచి మూడ్ పాడు చేసుకోకు. అదిగో, అమ్మ వొస్తుంది. ఆమె ముందు డిస్కషనొద్దు. నువ్వేంట్రా వెంకట్? వాడి పర్సనల్ విషయాలు నీకెందుకు?" శివ ఇద్దరికీ సర్ది చెప్పాడు.

★★★★★★★★★★★★★★★★★★★★★

వాళ్ళంతా వెళ్ళిపోయినా అశోక్ ఆలోచనలు తెగలేదు. తను శాస్త్రీయ నాట్యం చేయడం వల్ల తన నడకా, నడతా, బాడీ లాంగ్వేజీ ఏమైనా విభిన్నంగా వుందా? స్నేహితులంతా తనని చూసి నవ్వుకుంటున్నారా? అతనికేదో తెలియని ఆవేదనగా అనిపించింది. అమ్మ కూడా అలాగే అనుకుంటుందా? అందుకే తను భానుతోపాటు ఇంకొంత మంది అమ్మాయిలని పిలుస్తున్నానని చెప్పగానే కొంచెం ఆశ్చర్యంగా చూసిందా?

మగవాళ్ళు నాట్యం నేర్చుకుంటే అందరికీ వింతగా అనిపిస్తుందా? మరి సంగీతం నేర్చుకునే వాళ్ళ గురించి అలా ఏమీ అనుకోరే? సినిమాల్లో మగవారు చేసే నాట్యానికి ఎంతో విలువ మళ్ళీ! భాను కూడా తన గురించి అలా వింతగా అనుకుంటుందా? అతనికి రాత్రంతా నిద్ర పట్టలేదు.

★★★★★★★★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS